గోదావరి-బనకచర్లపై సుప్రీంకోర్టుకు

- **రాయలసీమ లిఫ్ట్ స్కీమ్‌పై కూడా**
- **తెలంగాణ సర్కారు నిర్ణయం**
- **ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష**

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు వ్యతిరేకంగా, అనుమతులు తీసుకోకుండా ఏపీ ప్రభుత్వం చేపట్టనున్న గోదావరి-బనకచర్ల ఇరిగేషన్ ప్రాజెక్టు, రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని తెలంగాణ సర్కారు నిర్ణయించింది. ఆ రెండు ప్రాజెక్టులపై పిటిషన్ వేసేందుకు సిద్ధమైంది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం.. గోదావరి, కృష్ణా నదులపై కొత్తగా ఏదైనా సాగునీటి ప్రాజెక్టును చేపట్టాలంటే ఆయా రివర్ బోర్డులతోపాటు అపెక్స్ కౌన్సిల్, సీడబ్ల్యూసీ అనుమతి అవసరం. కానీ, అందుకు విరుద్ధంగా ఏపీ సర్కారు చేపట్టిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనులపై ఎన్జీటీ ఇప్పటికే స్టే విధించింది. పర్యావరణ అనుమతుల జారీకి కేంద్రం కూడా నిరాకరించింది. కాగా, ఇటీవల ఏపీ ప్రభుత్వం వరద జలాల పేరిట గోదావరి-బనకచర్ల ఇరిగేషన్ స్కీమ్‌ను చేపట్టి 200 టీఎంసీల జలాలను గోదావరి నుంచి పెన్నా బేసిన్ తరలించేందుకు రూ.80 వేల కోట్లతో ప్రణాళికలను సిద్ధం చేసింది. ఆ ప్రణాళికలకు తాజాగా ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో ఆ రెండు ప్రాజెక్టులపై ఎలా ముందుకెళ్లాలన్న అంశంపై తెలంగాణ ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎర్రమంజిల్‌లోని జలసౌధలో జరిగిన ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ అనిల్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌తో చర్చించారు. అనంతరం ఆ రెండు ప్రాజెక్టులపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని తేల్చారు. అందుకోసం త్వరలో అడ్వకేట్ జనరల్‌తోపాటు ఇరిగేషన్ న్యాయవాదులు, సాగునీటి రంగ నిపుణులతో ప్రత్యేకంగా భేటీ కావాలని నిర్ణయించారు. పోలవరం నుంచి రాయలసీమకు ఏపీ నీటిని తరలిస్తే.. గోదావరి తీరంలోని భద్రాచలం పుణ్యక్షేత్రం మునిగిపోతుందని మంత్రి ఉత్తమ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పట్టణం చుట్టూ ప్రొటెక్షన్ వాల్‌ను నిర్మించేందుకు కేంద్ర సాయం తీసుకోవాలని, ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వేగంగా స్పందించాలని అధికారులను ఆదేశించారు. కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణకు హక్కుగా రావాల్సిన ఒక్క నీటి బొట్టునూ వదిలిపెట్టబోమని, అందుకోసం వాస్తవాలు, చట్టంలోని నిబంధనలు, రాష్ట్ర ప్రజల ప్రాథమిక హక్కుల ఆధారంగా సుప్రీంకోర్టులో కేసు వేసి పోరాడుతామని తేల్చి చెప్పారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు త్వరలో టెండర్లు పిలుస్తామని వెల్లడించారు.

జంఝావతి రబ్బర్ డ్యామ్ పరిశీలన

ఏపీలోని విజయనగరం జిల్లాలో ఝుంజావతి నదిపై నిర్మించిన రబ్బర్ డ్యామ్‌ను తెలంగాణ ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఆ డ్యామ్‌ను నిర్మించిన విధానం, పనితీరు గురించి అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన వీరాంజనేయ (ఏదుల) రిజర్వాయర్ నుంచి డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ప్రాజెక్టుకు నీటిని తరలించాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఏదుల నుంచి పోతిరెడ్డిపల్లి వరకు గ్రావిటీ ద్వారా నీటిని తరలిస్తారు. పోతిరెడ్డిపల్లి వద్ద 350 మీటర్ల పొడవుతో రబ్బర్ డ్యామ్‌ను నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో ఉన్న రబ్బర్ డ్యామ్‌లను పరిశీలిస్తున్నారు. అందులో భాగంగా ఝుంఝావతి నదిపై 2006లో నిర్మించిన రబ్బర్ డ్యామ్‌ను నల్గొండ సీఈ అజయ్ కుమార్, సీడీవో సీఈ మోహన్ కుమార్ బృందం పరిశీలించింది. రబ్బర్ డ్యామ్ నిర్మాణానికి అయిన ఖర్చు, పనితీరు, డిజైన్లు తదితర సాంకేతిక అంశాలను అధ్యయనం చేశారు.

సమావేశం వాయిదా

గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై భాగస్వామ్య రాష్ట్రాలతో ఈ నెల 7న నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎన్‌డబ్ల్యూడీఏ) నిర్వహించ తలపెట్టిన సమావేశం మరోసారి వాయిదా పడింది. ఈ మేరకు అథారిటీ అధికారులు రాష్ట్రాలకు సమాచారం అందించారు. జీసీ లింక్‌పై తుది నిర్ణయం తీసుకునేందుకు ఢిల్లీలో అత్యున్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని ఎన్‌డబ్ల్యూడీఏ ఇప్పటికే నిర్ణయించింది. ఆ సమావేశాన్ని హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించాలని తెలంగాణసహా ఇతర రాష్ట్రాలు కోరాయి. ఆ సమావేశానికి నేతృత్వం వహించాల్సిన కేంద్ర జల్‌శక్తిశాఖ అదనపు కార్యదర్శి ప్రస్తుతం విదేశీపర్యటనలో ఉన్నారు. దీంతో సమావేశాన్ని వాయిదా వేయాలని నిర్ణయించిన ఎన్‌డబ్ల్యూడీఏ.. తదుపరి తేదీని ప్రకటించలేదు. కానీ, ఆ సమావేశాన్ని ఫిజికల్ మోడ్‌లో ఢిల్లీలోనే నిర్వహించాలని నిర్ణయించినట్టు అధికారులు తెలిపారు.

డైవర్షన్‌తో డీప్ డ్యామేజీ!

- **బెడిసికొట్టిన రేవంత్ ప్రభుత్వ డైవర్షన్ పాలి'ట్రిక్స్'**
- **రాష్ట్రంలోని సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు హెచ్‌సీయూ వివాదాన్ని తెరమీదకు తెచ్చిన సర్కారు**
- **నెటిజన్ల ప్రశ్నలకు ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' విశ్లేషణలు**
- **హెచ్‌సీయూ వివాదంతో ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ మరింతగా అపకీర్తిని మూటగట్టుకొన్నదన్న గ్రోక్**
- **కాంగ్రెస్ ఓటు బ్యాంకుపై ప్రభావం ఉండొచ్చని వెల్లడి**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల వ్యవహారంలో రేవంత్ ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకు వెళ్లడానికి కారణమేంటి? పర్యావరణానికి నష్టం జరుగుతుందని విద్యార్థులు, ప్రజా సంఘాలు, పర్యావరణవేత్తలు, మేధావులు, రాజకీయ పక్షాలు ఉవ్వెత్తున ఉద్యమాలు చేపట్టినప్పటికీ సర్కారు మొండిగా ప్రవర్తించడానికి అంతరార్థమేంటి? రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ, వాటిని పరిష్కరించకుండా హెచ్‌సీయూ భూములపై ప్రభుత్వం ఎందుకు ఇంత ఆసక్తి కనబర్చింది? ఇవే ప్రశ్నలు నెటిజన్లకు కూడా వచ్చాయి. ఈ క్రమంలోనే ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్'ను ప్రశ్నించారు. దీనికి గ్రోక్ పలు ఆసక్తికరమైన విశ్లేషణలను ఇవ్వడం గమనార్హం.

ప్రశ్న: రేవంత్ ప్రభుత్వం హెచ్‌సీయూ వివాదాన్ని ఉద్దేశపూర్వకంగా తెరమీదకు తీసుకొచ్చిందా? ఇది డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనా?

గ్రోక్: ప్రతిపక్ష నేతలు, విద్యార్థులు, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న చర్చ ప్రకారం.. రేవంత్ ప్రభుత్వం హెచ్‌సీయూ వివాదాన్ని ఉద్దేశపూర్వకంగా తెరమీదకు తీసుకొచ్చిందని అంటున్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చర్యలకు దిగిందని చెప్తున్నారు. హెచ్‌సీయూ భూముల్లోకి రాత్రికి రాత్రి బుల్డోజర్లను పంపడాన్ని చూస్తే, ఇది నిజమేననిపిస్తున్నది.

ప్రశ్న: వేటి నుంచి దృష్టి మళ్లించడానికి రేవంత్ ప్రభుత్వం ఈ డైవర్షన్ డ్రామా ఆడిందని అనుకోవచ్చు?

గ్రోక్: రేవంత్ రెడ్డి సీఎంగా పగ్గాలు చేపట్టిన 15 నెలల్లో పలు వివాదాలు ప్రభుత్వాన్ని చుట్టుముట్టాయి. తాజాగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) వివాదం, గ్యారెంటీల అమలులో ప్రభుత్వ వైఫల్యం, రైతు ఆత్మహత్యలు, ఎండిపోతున్న పంట పొలాలు, నీటికి ఇబ్బందులు, ఆర్థిక సంక్షోభం, గ్రూప్-1 ఫలితాల్లో అవకతవకలు జరిగాయంటూ విమర్శలు రావడం.. ఇలా పలు వివాదాల్లో ప్రభుత్వం కొట్టుమిట్టాడుతున్నది. వీటి నుంచి ప్రజల దృష్టిమరల్చడానికే కాంగ్రెస్ సర్కారు హెచ్‌సీయూ వివాదాన్ని తెరమీదకు తీసుకొచ్చిందంటూ కొన్ని వార్తలు, ప్రతిపక్ష నాయకుల ఆరోపణలను బట్టి అర్థం చేసుకోవచ్చు.

ప్రశ్న: రేవంత్ ప్రభుత్వం హెచ్‌సీయూ భూములను ఎందుకు కావాలనుకొంటున్నది?

గ్రోక్: హెచ్‌సీయూలో వివాదం నడుస్తోన్న ఈ 400 ఎకరాల భూమి కంచ గచ్చిబౌలిలో ఉన్నది. వాణిజ్యపరంగా ఇది ఎంతో విలువైన ప్రాంతం. ఇక్కడి భూముల రేట్లు ఆకాశాన్నంటుతాయి. ఈ భూమి విలువ రూ. 10,000 కోట్లు-రూ. 15,000 కోట్ల మేర ఉంటుందని అంచనా. ఈ భూమిని అమ్మితే ప్రభుత్వానికి ఆర్థిక లాభం చేకూరుతుందన్న ఉద్దేశంతోనే రేవంత్ సర్కారు హెచ్‌సీయూ భూములను కావాలనుకొంటున్నది. ఈ భూములను వాణిజ్యావసరాలకు వినియోగించుకొని ఆర్థిక లాభం పొందాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నది.

ప్రశ్న: హెచ్‌సీయూ వివాదం వల్ల రేవంత్ ప్రభుత్వం ఏం సాధించింది?

గ్రోక్: హెచ్‌సీయూ వివాదం వల్ల రేవంత్ ప్రభుత్వం సాధించినదానికంటే కోల్పోయిందే ఎక్కువగా ఉన్నది. తమ చర్యలతో ప్రజా వ్యతిరేకతను కాంగ్రెస్ మూటగట్టుకొన్నది. రాజకీయ ఒత్తిడి వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నది. కోర్టుల ఆగ్రహానికి గురైంది. మొత్తంగా హెచ్‌సీయూ వివాదం సర్కారుకు ఓ సమస్యాత్మకంగా మారింది. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పట్ల ఇప్పుడు మరింత వ్యతిరేకత పెరిగిందనే చెప్పొచ్చు.

ప్రశ్న: హెచ్‌సీయూ వివాదం వల్ల రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగొచ్చా?

గ్రోక్: తెలంగాణలో యువ ఓటర్లు ఎక్కువ. హెచ్‌సీయూ భూములపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని వీళ్లు పెద్దయెత్తున వ్యతిరేకించారు. పోలీసులతో రేవంత్ ప్రభుత్వం చేయించిన లాఠీచార్జి, అరెస్టులను ఖండించారు. ఈ క్రమంలో యువతలో కాంగ్రెస్ పట్ల వ్యతిరేక భావన మరింతగా ఉద్ధృతమైంది. సోషల్‌మీడియాలో పోస్టులను బట్టి కూడా ఈ విషయం అర్థమవుతున్నది. హెచ్‌సీయూ వివాదంపై రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరిని కూడా మేధావులు, రాజకీయ వేత్తలు తీవ్రంగా తప్పుబట్టారు. ఇవన్నీ విశ్లేషిస్తే, రానున్న ఎన్నికల్లో ఈ వివాదం కాంగ్రెస్ ఓటు బ్యాంకుపై ప్రభావం చూపొచ్చని చెప్పొచ్చు.

మాట తప్పిన రేవంత్‌రెడ్డి

- **క్యాబ్ డ్రైవర్లకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?**
- **ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఆగ్రహం**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందు క్యాబ్ డ్రైవర్లకు హామీలు గుప్పించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వెన్నుపోటు పొడిచిందని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ బేస్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ విమర్శించాయి. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి, రవాణాశాఖ అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా ఫలితంలేదని ఆయా సంఘాల నేతలు మండిపడ్డారు. ఓలా, ఉబర్, ర్యాపిడో తరహాలో ప్రభుత్వమే ఒక యాప్ తీసుకొస్తుందని మాటిచ్చిన రేవంత్‌రెడ్డి హామీని విస్మరించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మాట తప్పడంలో సీఎం రేవంత్‌రెడ్డిని మించిన వారు లేరని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి డ్రైవర్ల ఉపాధి దెబ్బతీయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 7న క్యాబ్‌లను ఆర్టీఏ కార్యాలయంలో వదిలేసి వెళ్తామని హెచ్చరించారు.

బ్లీచింగ్ పౌడర్‌కు పైసల్లేవ్!

- **ట్యాంకులు కడగలేని దుస్థితి**
- **పంచాయతీలకు నిధులు కరువు**
- **క్లోరినేషన్ పట్టని అధికారులు**
- **మిషన్ భగీరథ నీరు కలుషితం**
- **డయేరియా అంచున ప్రజానీకం**

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): మిషన్ భగీరథ పథకం లక్ష్యం నీరుగారుతున్నది. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించాలనే సంకల్పం సడలుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఓవర్ హెడ్ ట్యాంకులను నిబంధన ప్రకారం శుభ్రం చేయడం లేదు. నీటి క్లోరినేషన్‌ను కూడా పట్టించుకోవడం లేదు. ప్రజలు ఎవరైనా వచ్చి అడిగేతప్ప, పంచాయతీ సిబ్బంది నీళ్ల ట్యాంకులను శుభ్రం చేసే పరిస్థితిలేదు. సర్పంచుల పదవికాలం ముగియడంతో ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగుతున్నది. ఈ నేపథ్యంలో ప్రజారోగ్యం గాలిలో దీపంలా మారింది.

నిలిచిన నిధుల విడుదల

రేవంత్‌రెడ్డి సర్కారు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామాలకు అందడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం కార్యదర్శులకు వేతనాలు మాత్రమే చెల్లిస్తున్నది. పంచాయతీ నిర్వహణకు ఎలాంటి నిధులు విడుదల చేయడం లేదు. ఫలితంగా గ్రామాల పాలన కార్యదర్శులు ప్రహసనంగా మారింది. అప్పులు చేసి మరీ పారిశుధ్య నిర్వహణ వంటి అత్యవసర పనులను నిర్వహిస్తున్నారు. కానీ, మిషన్ భగీరథ నీళ్ల ట్యాంకు పరిస్థితి పట్టించుకొనే వారు లేకుండాపోయారు. భగీరథ పైప్‌లైన్లు లీకేజీలను అరికట్టకపోతున్నారు. ట్యాంకులను శుభ్రం చేయకుండానే నీటిని సరఫరా చేస్తున్నారు. కొందరు నెలకు ఒకసారి, రెండు నెలలకు ఒకసారి శుభ్రం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత 15 నెలల్లో మూడు, నాలుగుసార్లు మాత్రమే శుభ్రం చేసినట్టు కార్యదర్శులే చెప్తున్నారు.

మిషన్‌భగీరథ స్వరూపం

నీళ్లు తీసుకొనే ప్రాంతాలు	77
వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు	123
గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు	35,716
వాటర్ పైప్‌లైన్ నెట్‌వర్క్	1.50 లక్షల కి.మీ

నిబంధన ఎక్కడా పాటించడం లేదు

గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతినెలా 1, 11, 21 తేదీల్లో, అంటే పది రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని నిబంధనలు ఉన్నాయి. శుభ్రం చేసిన తేదీలను ట్యాంకుల వద్ద, వాటర్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో వాటర్‌మెన్ ట్యాంకులను నెలకు మూడుసార్లు శుభ్రంచేయాలి. బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. కానీ, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ కూడా ఈ నిబంధన అమలుకావడంలేదు. నిధులు లేకపోవడమే ఇందుకు కారణమని కార్యదర్శులు చెప్తున్నారు.

వనరులు వాడుకొనే పరిస్థితి లేదు

నిధులు లేక, పనులు జరగక స్థానిక సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయి. అభివృద్ధి పనులు జరగడం లేదు. కనీస మౌలిక వసతులు కల్పించడానికి కూడా కార్యదర్శులం కష్టపడాల్సి వస్తున్నది. క్లోరినేషన్, శానిటేషన్‌తోపాటు పారిశుద్ధ్య కార్మికులు పనిముట్లు కూడా కొందరు అందించలేకపోతున్నారు. బ్లీచింగ్ పౌడర్ కూడా కొనే పరిస్థితి లేదు. వీధిలైట్లు, నీటి సరఫరా మోటారు రిపేరు చేయలేని, లీకేజీలు అరికట్టలేని పరిస్థితులు వచ్చాయి. గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్ను రూపంలో వసూలైన డబ్బులు వాడుకొనే పరిస్థితి కల్పిస్తే కార్యదర్శులకు కొంత వెసులుబాటు ఉంటుంది.

-పీ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

'గ్రూప్-1' గోడు పట్టించుకోరా!

- **బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి**

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో తమకు అన్యాయం జరిగిందని అశోక్‌నగర్‌లో ఆందోళన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగుల గోడు పట్టించుకోవాలని, వారికి తగు న్యాయం చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేశ్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ తెలంగాణ భవనలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రూప్-1లో అవకతవకలు జరిగాయని, ఈ పరీక్ష నిర్వహణలో అనేక లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని సూచించారు. 46 పరీక్ష కేంద్రాల్లో కేవలం 2 సెంటర్లలోనే 74 మంది టాపర్లు ఉన్నారని, కొన్ని సెంటర్లలో ఒక్క టాపర్ కూడా ఎందుకు లేరని ప్రశ్నించారు. పక్క పక్క నంబర్లలో 13 మందికి ఒకే రకమైన ఫలితాలు ఎలా వస్తాయి? ఇదెలా సాధ్యమైంది? అని అనుమానాలను వ్యక్తంచేశారు. గ్రూప్-1లో మొత్తం పేపర్లను మళ్లీ రీ వాల్యూయేషన్ చేయాలని, లేదా మళ్లీ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న గ్రూప్-1 అభ్యర్థులకు తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగం రాలేదని ఆత్మహత్య

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 4: ఉద్యోగం రాలేదన్న దిగులుతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓ యువకుడు ఉసురు తీసుకున్నాడు. సిరిసిల్ల సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని అంబికానగర్‌కు చెందిన చింతకుంట దుర్గాప్రసాద్(22) స్థానికంగా ఓ ప్రైవేట్ డిగ్రీ కాలేజీలో సెకండియర్ చదువుతున్నాడు. గతంలో వివిధ పోటీ పరీక్షలు రాశాడు. ఎటువంటి ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి చింతకుంట శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రూప్-1 టాపర్లలో 13 మంది ఏపీ వారే!

అందరి ర్యాంకు 500లోపే
కీలకపోస్టులు కొల్లగొట్టే చాన్స్

- **తెలంగాణ బిడ్డల ఉద్యోగాలకు గండి - నిరుద్యోగుల్లో ఆందోళనలు**
- **తెలంగాణపై ప్రశ్నలివ్వని టీజీపీఎస్సీ - ఏపీ అభ్యర్థులకు పరోక్ష సహకారం**
- **కొన్ని సెంటర్ల నుంచే ఏపీ వారు ఇద్దరేసి టాపర్లుండటంపై సందేహాలు**
- **పేపర్ లీకేజీనా లేక కాపీయింగ్ జరిగిందా అంటూ నిరుద్యోగ జేసీ అనుమానాలు**

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): 'ఎవుసం అంటే ఏమిటి?. పునాస అర్థం ఏమిటి.. ఆనపకాయ అని దేనినంటారు. ముద్దపప్పు బతుకమ్మ ఏ రోజు ఆడుకుంటారు.. పగిడిద్దరాజు ఎవరి భర్త.. మలీద ముద్దను దేనితో తయారుచేస్తారు' అన్న ఈ ప్రశ్నలకు సమాధానం తెలియదు. కనీసం వాటిగురించి అవగాహన కూడా లేదు. కానీ వారంతా గ్రూప్-1మెయిన్‌లో టాపర్లుగా నిలిచారు. నాన్‌లోకల్ అభ్యర్థులుగా వచ్చి.. అన్నీ తెలిసిన, అన్నింటిపై సమగ్ర అవగాహన ఉన్న తెలంగాణ బిడ్డల ఉద్యోగాలను కొల్లగొట్టబోతున్నారు. దీనికంతటికి కారణంగా కాంగ్రెస్ సర్కారు నిర్వాకమే.

నీళ్లు. నిధులు.. నియామకాలు.. ఇది తెలంగాణ ఉద్యమ ట్యాగ్‌లైన్. కానీ కాంగ్రెస్ పాలనలో స్వరాష్ట్ర ఉద్యమ ఆకాంక్షలు క్రమంగా నీరుగారిపోతున్నాయి. ఇప్పటికే కృష్ణా నీళ్లను ఏపీ కొల్లగొట్టింది. తాజాగా ఉద్యోగాలు సైతం ఏపీ వాళ్ల సొంతమవుతున్నాయి. అత్యంత కీలకమైన, ఎంతో ప్రాధాన్యం గల గ్రూప్-1 పోస్టులను పల్లెంలో పెట్టి వడ్డించినట్టుగా ఏపీ అభ్యర్థులకు కట్టబెడుతున్నది. ఇలా ఏకంగా 13 మంది మన దగ్గర కొలువులు కొల్లగొట్టబోతున్నారు. ఇటీవల వెల్లడించిన గ్రూప్-1 మెయిన్ టాపర్లలో 13 మంది ఏపీ అభ్యర్థులున్నారు. వీరిలో ఎనిమిది మంది ఓసీలే ఉన్నారు. ఈ ఎనిమిది మందిలో ఇద్దరు ఈడబ్ల్యూఎస్‌ను క్లెయిమ్ చేశారు. ఎస్సీలు ఒక్కరు మాత్రమే ఉన్నారు. ముఖ్యంగా అత్యంత కీలకమైన డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) వంటి కీలక ఉద్యోగాలను ఏపీ అభ్యర్థులు దక్కించుకోబోతున్నారు. వీరంతా టాప్-500లోపు ర్యాంకుతో ఉండ టం తెలంగాణ అభ్యర్థులను కలవరపరుస్తున్న ది. ఇదేం పరీక్ష.. ఇవేం ఫలితాలు అన్న ప్రశ్న లు నిరుద్యోగుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

నాన్ లోకల్ అభ్యర్థుల వివరాలిలా..

హాల్‌టికెట్ నెంబర్ (చివరి మూడు నంబర్లు)	ర్యాంకు	మార్కులు
150	03	535.50
205	20	512.50
380	34	505.50
499	92	488.50
391	97	488.00
086	262	468.00
125	271	467.50
064	301	465.50
584	324	464.00
402	361	461.50
096	369	461.00
015	389	460.00
066	496	455.00

ఒక్కో సెంటర్ నుంచి ఇద్దరు..

టాపర్లుగా నిలిచిన నాన్‌లోకల్ అభ్యర్థులు కొన్ని ఎంపికచేసిన సెంటర్ల నుంచే ఉండటం అనుమానాలకు తావిస్తున్నది. ఒక్కో సెంటర్ నుంచి ఇద్దరు చొప్పున నాన్‌లోకల్ అభ్యర్థులు టాపర్లుగా నిలిచారు. దీంతో ఏదో స్కాం జరిగే ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సెంటర్-7 నుంచి ఇద్దరు టాపర్లుండగా, ఒకరికి 535, మరొకరికి 512.50 మార్కులొచ్చాయి. సెంటర్ -8లోను ఇద్దరున్నారు. వీరిలో ఒకరికి 505 మార్కులు, మరొకరికి 369 మార్కులొచ్చాయి. సెంటర్ 12 నుంచి సైతం ఇద్దరు, 46 నుంచి ఇద్దరు చొప్పున నాన్‌లోకల్ అభ్యర్థులు అత్యధిక మార్కులు సాధించారు. మెయిన్ పరీక్షలను నిర్వహించిన సెంటర్లలో ర్యాండమ్‌గా టాపర్లుండాలి. కానీ ఒకే సెంటర్లో అది నాన్‌లోకల్ అభ్యర్థులే ఉంటారని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. దీనివెనుక ఏదో తతంగం జరిగి ఉంటుందని అభ్యర్థులు అనుమానిస్తున్నారు.

పేపర్ లీక్‌చేశారా.. ? లేక కాపీయింగా..?

గ్రూప్-1 మెయిన్‌లో రోజుకో బాగోతం వెలుగుచూస్తుండటంతో నిరుద్యోగుల్లో అనుమానాలు బలపడుతున్నాయి. గ్రూప్-1 మెయిన్ పేపర్‌ను లీక్ చేశారా? లేక కొన్ని సెంటర్లలో మాస్ కాపీయింగ్ జరిగిందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే సెంటర్ నుంచి టాపర్లు ఉండటమంటే పేపర్ లీకేజీ జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. గతంలో గ్రూప్-1 మెయిన్‌కు అంతా సిద్ధమయ్యాక పేపర్ లీకేజీతో పరీక్ష రద్దయ్యింది. అప్పుడు రూపొందించిన ప్రశ్నపత్రాలను ఏడాదిన్నర తర్వాత తాజాగా వాడినట్టు అభ్యర్థులు అనుమానిస్తున్నారు. టీజీపీఎస్సీలో పనిచేసిన వారే ప్రిలిమ్స్ పేపర్ లీకేజీలో పాత్రధారులుగా ఉన్నారు. అప్పుడెప్పుడో రూపొందించిన మెయిన్ ప్రశ్నపత్రం సైతం బయటి వ్యక్తుల చేతుల్లోకి వెళ్లి ఉంటుందని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

తెలంగాణపై ప్రశ్నలివ్వకపోవడంతోనే..

మన ఉద్యోగాలు మనకే దక్కాలన్న ఆశయంతో టీజీపీఎస్సీ గత పదేండ్ల కాలంలో అనేక వ్యూహాత్మక ఎత్తుగడలను అనుసరించింది. ముఖ్యంగా తెలంగాణ వ్యవహారిక భాష, పదజాలం, వేషధారణ, ఆహారం, సంస్కృతి, పండుగలు, సినిమాలు, జాతరలు వంటి అంశాలపై పోటీ పరీక్షల్లో ప్రశ్నలిచ్చింది. తెలంగాణ ఉద్యమంపైనా అప్పుడప్పుడు ప్రశ్నలను సంధించింది. మన పిల్లలకు ఉద్యోగాలు దక్కడంతో పాటు, ఇతర రాష్ట్రాల వారిని అడ్డుకోవడం దీని వెనుకున్న అంతరార్థం. కానీ కాంగ్రెస్ సర్కారు కొలువుదీరిన తర్వాత నిర్వహించిన గ్రూప్-1 సహ అనేక పోటీ పరీక్షల్లో తెలంగాణ అంశాలపై అంతగా ప్రశ్నలివ్వడం లేదు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో తెలంగాణ అంశాలపై ఇచ్చిన ప్రశ్నలు చాలా స్వల్పం. ఇలా టీజీపీఎస్సీ పరోక్షంగా ఏపీ అభ్యర్థులకు సహకారం అందించిందని నిరుద్యోగ జేఏసీ నేతలంటున్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రశ్నలివ్వాల్సి వస్తుందన్న కారణంతో ఆ ప్రశ్నల జోలికెళ్లడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. కేవలం పుస్తకాల్లోని అంశాలపైనే ప్రశ్నలిస్తూ వస్తున్నారు. దీంతో తెలంగాణ సిలబస్‌ను చదువుకున్న అభ్యర్థులకు అన్యాయం జరగగా, వీటిపై ఏ మాత్రం అవగాహన లేని ఏపీ అభ్యర్థులకు గేట్లు తెరిచినట్లయ్యింది.

ఇట్లయితే భవిష్యత్తును పణంగా పెట్టినట్టే

గ్రూప్-1 ఉద్యోగాల్లోకి ఏపీ అభ్యర్థుల రాకను కేవలం ఉద్యోగాలు కొల్లగొట్టడమన్న ఒక్క కోణంలోనే చూడొద్దని నిరుద్యోగ జేఏసీ నేతలంటున్నారు. ఇది మనకు మనమే మన భవిష్యత్తును నాశనం చేసేందుకు పునాదులు వేసుకున్నవాళ్లమవుతామని గ్రహించాలంటున్నారు. గ్రూప్-1 అంటేనే సివిల్ సర్వీసెస్ స్థాయి పోస్టులు. వీటిలో డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ, ఎంపీడీవో వంటి కీలక పోస్టులున్నాయి. ఇప్పుడు ఎంపికైన అభ్యర్థులు ఓ పదేండ్ల తర్వాత ఐఏఎస్, ఐపీఎస్‌లవుతారు. ఎంపీడీవోలు జెడ్పీ సీఈవోలవుతారు. ఈ పోస్టులకున్న ప్రాధాన్యం మనకు తెలిసిందే. పరిపాలనలో ఇవే అతి ముఖ్యమైనవి. ఇప్పటికే అనేక అంశాల్లో మన పక్క రాష్ట్రం ఏపీతో మనకు లొల్లినడుస్తున్నది. కృష్ణా జలాలు, విద్యుత్తు, వనరుల పంపిణీ వంటి అనేక అంశాల్లో రెండు రాష్ట్రాల మధ్య వివాదాలున్నాయి. రేపు ఇదే అధికారులు సర్కారులో కీలకమయితే ఏపీకి అనుకూలంగా వ్యవహరించే అవకాశాల్లేకపోలేదు. ఇదే జరిగితే తెలంగాణ భవిష్యత్తును పణంగా పెట్టినట్టేనని నిరుద్యోగ జేఏసీ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ప్రిలిమ్స్ దాటినా 3 మార్కులే!

మొదటిపేజీ తరువాయి...

అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. జనరల్ ఇంగ్లిష్‌లో 50శాతం మార్కులొచ్చిన వారికి 6 పేపర్లు కలిపినా 10-20శాతం మార్కులు రావా..? అంటూ ప్రశ్నిస్తున్నారు. గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనం మొత్తం లోపాల పుట్టగా తయారయ్యిందని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

ప్రిలిమ్స్ దాటిన వారికి మూడు, ఆరు మార్కులెలా..

గ్రూప్-1 ప్రిలిమ్స్ పేపర్ అత్యంత కఠినమైన పేపర్. ఏండ్ల తరబడి ప్రిపేరైన వారే ఈ పేపర్ చూసి జడుసుకుంటారు. 4.5 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే 2.32లక్షల మంది పరీక్షరాశారు. వీరిలో నుంచి 31 వేల మందిని మెయిన్స్‌కు ఎంపికచేశారు. మెయిన్స్ పరీక్ష రాసింది 21వేల మంది. వీరంతా మూడు నెలలుపాటు కష్టపడ్డవారే. కొంత మంది ఉద్యోగాలకు సెలవులు పెట్టి మరీ సన్నద్ధమయ్యారు. ప్రిలిమ్స్ దాటిన వారికి మూడు, ఆరు మార్కులెలా వస్తాయన్న ప్రశ్నలు నిరుద్యోగుల నుంచి వినిపిస్తున్నాయి.

కాంట్రాక్ట్ లెక్చరర్లతో దిద్దించారు..

వర్సిటీ ప్రొఫెసర్ల చేత మూల్యాంకనం చేయించామని టీజీపీఎస్సీ చెబుతున్నది. కా నీ డిగ్రీ, కాంట్రాక్ట్, ఎయిడెడ్ కాలేజీల లెక్చరర్లతో మమ అనిపించేశారని, ఇందుకు తా ము వందల ఆధారాలు చూపుతామని అభ్యర్థులంటున్నారు. తెలంగాణ ఉద్యమం పేపర్లను హిస్టరీ, పొలిటికల్ సైన్స్ ఫ్యాకల్టీతో మూల్యాంకనం చేయించారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. సివిల్స్ కంటే టీజీపీఎస్సీ మూల్యాంకనం అంత గొప్పదా..? అని నిరుద్యోగ జేఏసీ నేతలు ప్రశ్నిస్తున్నారు. సొసైటీ పేపర్‌ను పొలిటికల్ సైన్స్ వారితో, ఎన్విరాన్‌మెంట్ సెక్షన్‌ను ఎకనామిక్స్ ఫ్యాకల్టీతో మూల్యాంకనం చేయించినట్టు ఆరోపణలున్నాయి.

ఎమ్మెల్సీ ఎన్నికలో లబ్ధిపొందాలనుకుని..

గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనం సమయంలోనే గ్రాడ్యుయేట్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టింది. అయితే సర్వేలో కాంగ్రెస్ అభ్యర్థి వెనుకబడ్డట్టు సర్కారుకు ఉప్పందింది. నిరుద్యోగులు, యువత అంతా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నారని సర్వేలో తేలింది. నష్టనివారణ చర్యల్లో భాగంగా గ్రూప్-1 ఫలితాలు ప్రకటిస్తే నిరుద్యోగులను మచ్చికచేసుకోవచ్చని, గెలవవచ్చని ఎత్తుగడవేశారు. 6వేల అభ్యర్థుల పేపర్లను ఏపీలో మూడు నెలల్లో మూల్యాంకనం చేస్తే, 21వేల అభ్యర్థుల పేపర్లను రెండు నెలల్లో పూర్తిచేయడం వెనుక ఇదే జరిగిందని వారంటున్నారు. అయినా మూల్యాంకనం పూర్తికాకపోవడంతో ఫలితాలు ప్రకటించలేకపోయారని, కానిప్పుడు అనేక అక్రమాలు బయటపడుతున్నాయని అభ్యర్థులంటున్నారు.

ప్రకృతి ప్రసాదించిన వరం దేశీయ విత్తనాలు

- **హైబ్రిడ్ విత్తనాలతో ఆహారం విషంగా మారింది**
- **తెలంగాణ విత్తన పండుగలో పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డి**
- **రైతు హక్కుల కోసం పోరాడాలి**
- **ఉద్యాన వర్సిటీ వీసీ రాజిరెడ్డి**


విత్తన పండుగలో పాల్గొన్న ఉద్యాన వర్సిటీ వీసీ రాజిరెడ్డి, పర్యావరణవేత్త పురుషోత్తం రెడ్డి, తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ): ప్రకృతి ప్రసాదించిన వరం దేశీయ విత్తనాలని పలువురు నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేశారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అనాస్‌పల్లి ది ఎర్త్ సెంటర్ ప్రాంగణంలో శుక్రవారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, భారత్ బీజ్ స్వరాజ్‌మంచ్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ తొలి విత్తన వార్షికోత్సవ పండుగ ప్రారంభమైంది. ఈ కార్యక్రమం మూడ్రోజులపాటు జరుగనున్నది. మొదటి రోజు ముఖ్య అతిథులుగా కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ డాక్టర్ దండ రాజిరెడ్డి, ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాజిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయం సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే సంప్రదాయ, దేశీయ పంటలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన దేశీయ విత్తనాలు కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. బహుళజాతి కంపెనీలు హైబ్రిడ్ విత్తనాలను రైతులపై రుద్దుతున్నాయని తెలిపారు.